

# శకుంతల

—చక్కిలం విజయలక్ష్మి

**అ**క్కడ... ఆ రోడ్డుమీద...

మనిషిని ఆశ్రయించుకుని తన వునికిని నిలుపుకునే జీవితం... ఆ జీవితం మోసగించి నప్పుడు మనిషి ఎక్కడ నిలబడాలో అక్కడే నిలబడి వుంది శకుంతల... రోడ్డుమీద.

భారతదేశపు గాలి పీల్చిన నేరానికి దాని పవిత్రతను కాపాడవలసిన బాధ్యత భుజస్కంధాల మీద కలిగివున్న స్త్రీ, శకుంతల ఆ బాధ్యతను మరచినదానిలా ఖూనీ చేయవలసిన పాప భారాన్ని పదిలంగా కడుపులో మోస్తూ నిలబడి వుంది! ఆమెకు భారతదేశపు పవిత్రత, స్త్రీ మాత్రమే నిలబెట్టవలసి వున్న పవిత్రత విలువ తెలిసినట్టు లేదు. లేకపోతే మాతృత్వపు మమకారాన్ని వూపిరితోనే పాతిపెట్టి, తన జీవితాన్ని పవిత్రత అనే పదానికి మీదు కట్టి వుండేది. ఇలా సిగ్గు విడిచి తన అపవిత్రతా చిహ్నాన్ని కడుపుతో ఎత్తి పట్టుకుని తగుదునమ్మా అంటూ వూరూ వాడా తిరిగేది కాదు. చూస్తే అడవిమనిషిలా వుంది!

అయినా శకుంతల శకుంతలలాగే వుంది, అందంగా, అనితర సుందరంగా. కాకపోతే పనికిరాని ఫ్రేము బిగించిన అద్భుత చిత్రంలా వుంది. తగిన శిల వుపయోగించని అపురూప శిల్పంలా వుంది. అంతే.

శకుంతల మళ్ళీ ఆ భవనంకేసి చూసింది, కుంటివెధవ ఎవరెస్ట్ నెక్కాలని చూసినట్టు, మహాపాపి స్వర్గాన్ని అధిరోహించాలనుకున్నట్టు. కనీసం ఆ భవనం తాలూకు గూర్ఖా కలా అనిపించింది. 'జా జా' అన్నట్లుగా చేయి విసిరాడు.

దాదాపు గంట సేపటిగా గూర్ఖాకు, శకుంతలకు మధ్య ఈ యుద్ధం జరుగుతోంది. గేటు దగ్గరకు వచ్చిన శకుంతలను తోసినంత పని చేశాడు, కనీసం ఆమె చెప్పేదైనా వినిపించుకోకుండా. అప్పట్నించీ అలా దూరంగా నిలబడి చూస్తూనే వుంది శకుంతల, నోరుండీ లేనిదానిలా.

గూర్ఖా తిరస్కారం శకుంతల మనసును ఛిద్రం చేసింది. అభిమానం, ఆత్మ గౌరవం తాలూకు తొక్కిసలాటలో శకుంతల గుండె నలిగిపోయింది.

ఆయన కనిపించాలి ... ఆయన కనిపించాలి. అప్పుడు... ఆ అప్పుడు గూర్ఖాను శిక్షించాలనేమీ లేదు.

# సినీతారలు

మీకు నచ్చే నలుగురి తారల
సెక్సు ఫొటోసెట్ 10 రూ.
మీరు మెచ్చే ఒక నటి.నటుడి
ఫొటో సెట్ 5 రూ.
నటీనటుల అడ్రసులుగల డైరీ 2 రూ.
కావలసినవారు M.O. చేయండి.

**వై.కె.మూర్తి,**
[illegible]వారివీధి విజయవాడ-2.



సెక్సు,
సుఖవ్యాధులు,
సంతానము,
గర్భాశయ వ్యాధులు,
మొలలు,
చర్మ వ్యాధులకు
అనుభవ చికిత్స.
పోస్టుద్వారా
చికిత్స కలదు.

## సరోజ నర్సింగ్ హోమ్

డాక్టర్ యన్. సరోజిని
H. O. కొత్తపేట చౌకు,
విజయవాడ-1
బ్రాంచి : శిలంవారి వీధి, జిన్నాటవర్,
గుంటూరు.

## మీకు బేబి/బాబు కావాలా



ఆపరేషన్. ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష సంధ్యాదోష నివారణా నిపుణులు. * ఉచిత వివరములకు :

**శ్రీ నాగార్జున మూలిక కుటీరం,**

రామాలయం వీధి, తెనాలి-2. | క్రవలైను, కేదారేశ్వరపేట, విజయవాడ-3.


# శకుంతల

శకుంతలకు. ఆయన ... ఆయన తన నడుము చుట్టూ చేయివేసి, మరో చేతితో తన చేయి పట్టుకుని లోనికి నడిపిస్తూ వుంటే గూర్ఖాను చూసి చిరునవ్వు, చిన్న చిరునవ్వు నవ్వాలని వుంది. అంతే.

కానీ అది జరుగుతుందా ?! జరుగుతుందనే శకుంతల నమ్మకం. ఆమెకు అభిజ్ఞాన శాకుంతలం ఎంతో ఇష్టం. ఏ పాపమూ ఎరుగని దుష్యంతుడు శకుంతల పొందిన శాపం వల్ల దుర్మార్గుడుగా, నమ్మక ద్రోహిగా చిత్రింప బడటాన్ని ఎంతైనా నిరసిస్తుంది శకుంతల. ఆమె దుష్యంతుని ఎంతో సానుభూతితో అర్థం చేసుకుంది. తన జీవితంలోని దుష్యంతుని కూడా ఆమె అదే దృష్టితో చూస్తోంది.

ఎందుకో తెలీదు; ఆయన తన దగ్గరకు రాలేని పరిస్థితి ఏర్పడింది. తనే రావాలనుకుంది. వచ్చింది. తప్పేముంది ? ఇదీ శకుంతల అభిప్రాయం.

ఎంత కష్టపడాలో అంతా కష్టపడి ఆయన, సుకుమార్ ఇల్లు తెలుసుకుంది. కానీ గూర్ఖా ...

ఆయన రావాలి. అప్పుడు ... అప్పుడు ...

కారు హారన్ శబ్దానికి వులికిపడి పక్కకు తప్పుకుంటూ కార్లోకి చూసింది శకుంతల. అంతే.

శకుంతల గుండె లయ తప్పింది.

ఆయన ... ఆయన ... !!!

శకుంతల ఆనందపు కోలాహలంలోంచీ, ఆశ్చర్యపు వెల్లువలోంచీ తేరుకోకముందే కారు ఆమెను దాటుకుని గేట్లోకి వెళ్లిపోయింది.

శకుంతల రెప్పపాటులో తేరుకుంది. లేడిలా పరిగెత్తింది.

'''ఏమండీ ... ఏమండీ ...''

గూర్ఖా ఆమె శరీరాన్ని అడ్డగించాడుగానీ స్వరాన్ని ' అడ్డగించలేకపోయాడు. ముందుకు వెళ్తూన్న కారు స్లోఅయి క్రమంగా ఆగిపోయింది. కారు విండోలోంచి ఓ తల బయటకువచ్చి, ఇటు తిరిగి శకుంతలకేసి చూసింది. ఆ చూపు తన మీద పడినప్పుడు పాల వెన్నెలలో స్నానం చేసినట్లు పులకించిపోయింది శకుంతల. ఆయన చూపుల కొసలు తనను తాకిన క్షణం ఆయన కన్నులలో మెరుపులు మెరుస్తాయనీ, అమృతం కురుస్తుందనీ ... కానీ, అతని కనుబొమలు అర్థంకాని లెక్కను చూసినట్లుగా చిక్కుముడి పడ్డాయి !

అతను గూర్ఖాను రమ్మని సౌంజ్ఞ చేశాడు. గూర్ఖా పరిగెత్తుకుంటూ వెళ్లాడు. అతను శకుంతలను చూపిస్తూ ఏదో చెప్పాడు. గూర్ఖా తల వూపాడు.

శకుంతల ఆదుర్దాతో చూస్తోంది.

ఆయన ... తన నడ్డగించినందుకు

## స్వార్థపరుడు

స్వార్థపరుని గుండె
తేలు కొండె —
స్వార్థపరుని హృదయం
దెయ్యాల నిలయం —
స్వార్థపరుని తెలివి
దేశం తలపై కొరివి —
స్వార్థపరుని కళ్ళు
దేశం దేహంపై పుళ్ళు —
కరడుగట్టిన మతోన్మాదం
వీడికి వేదం —
కుళ్ళిపోయిన కులతత్వం
వీడికి సర్వసమ్మతం —

— భగ్వాన్.

గూర్ఖాను చీవాట్లు వేస్తున్నారా ? లేక తనను లోనికి తీసుకురమ్మని చెబుతున్నారా ?

ఆమె ఆశలమీద, ఆలోచనలమీద కారు చక్రాలు బరువుగా దొర్లిపోయాయి.

నిర్ఘాంతపోయింది శకుంతల. నిర్విణ్ణు రాలయింది శకుంతల.

ఆయనేం చెప్పారో తెలీదు. ఏం చేయ మన్నారో తెలీదు. అయితే తనేం ఆశించిందో అది జరగబోవడంలేదని మాత్రం అర్థమైంది శకుంతలకు.

గూర్ఖా దగ్గరకు వచ్చాడు.

''ఇదిగో ! ఇట్రారా. ఇక్కడ నిలబడు. ఒక్క అడుగు ముందుకు వేశావో మెడబట్టి బయటికి గెంటేస్తాను'' శకుంతలను తీసికెళ్లి భవనానికి కొంచెం దూరంలో, దారికి ఒకవైపుగా లాన్‌లో నిలబెట్టాడు.

అతని మాటే తప్ప తనేం అడిగినా సమాధానం ఇచ్చేలా కనిపించలేదు గూర్ఖా. ఏమీ అడగాలనీ అనిపించలేదు శకుంతలకు. ఖైదీలా అతను నిలబెట్టిన చోట నిలబడి పోయింది.

గూర్ఖా గేటు దగ్గరకు వెళ్లిపోయాడు.

శకుంతల భవనం కేసి చూసింది.

అలనాడు దుష్యంతుని రాజభవనం ఇంత గొప్పగానూ వుండిందా ! అనుమానం వచ్చింది శకుంతలకు.

అమాయకమైన కళ్లతో తనను కరిగించిన యువకుడు, ఆరాధనా సుమాలతో తన నభిషేకించిన ప్రియుడు ఇంత స్థితిపరుడంటే నమ్మ సఖ్యంగా లేదు. కానీ నమ్మాలనే అనిపించింది శకుంతలకు. ఎందుకంటే అతని కళ్లున్నది తనను చూడడానికే అన్నంత మక్కువతో పూలు కురిసేలా చూసిన ఆ చూపులకు... కార్లోంచి అపరిచితుడిలా, అహంతో, హుందాగా ముళ్లు గుచ్చినట్లుగా చూసిన ఈ చూపులకువున్న తేడాకంటే

ఇదేమీ ఎక్కువకాదు. లేడికూన పెద్ద పులిగా కనిపించినట్లుగా... !

ఏమయిందీయనకు ? తనను మ ర చి పోయారా ? తన కెవరూ శాపం ఇచ్చిన గుర్తు లేదే ! నవ్వు వచ్చింది శకుంతలకు.

ఆయన తనను మరచిపోలేదు. లేకపోతే తన నిక్కడిదాకా రానిచ్చి ఇక్కడ నిలబెట్టవలసిన అవసరం లేదు. కాకపోతే గుర్తుంచుకోవలసిన రీతిలో గుర్తుంచుకోలేదు. అంతే.

లోనుండి సుకుమార్ వచ్చి వరండాలోని సోఫాలో కూర్చున్నాడు. అతని వెంట దాదాపు అరడజను కుక్కలు వున్నాయి. అతని చేతుల్లో బి స్కె ట్ పా కె ట్లు వున్నాయి. సుకుమార్ పాకెట్లువిప్పి బిస్కట్లు కుక్కలకు అందించ సాగాడు సుతారంగా.

చాలా అందమైన కుక్కలు. బాగా బొచ్చు వున్నవి ఖరీదైన బిస్కట్లు తింటున్నాయి. యజమాని వజ్రపుటుంగరాల వేళ్లతో పెడుతున్నాడు. ఈ దృశ్యం ఎంతో బావుంది. చూడ ముచ్చటగా వుంది.

రాక్షసులు ఏలుతున్న స్వర్గాన్ని చూస్తున్న దేవతలా చూసింది శకుంతల ఆ దృశ్యాన్ని.

కుక్కలు బిస్కట్లుతింటూ యధాలాపంగా చూస్తూ శకుంతలను చూశాయి. శకుంతల తమను చూడ్డం చూశాయి. భుక్తాయాసంతో చికాగ్గా వున్న కుక్కలకు ఆ చూపు సహించి నట్లులేదు. "భౌ" మంటూ ముందు కురికి వచ్చాయి. అదిరిపడిన శకుంతల ఒక్క వుదుటున పరిగెత్తబోయి క్రింద పడిపోయింది.

"టామీ, బులెట్, లిజీ, కమాన్. కమాన్ ఐసే" సుకువూర్ సుకుమారంగా పిలిచాడు.

కుక్కలు అక్కడే ఆగి, నింపాదిగా వెను దిరిగాయి.

క్రింద పడివున్న శకుంతల సుకుమార్‌కేసి చూసింది. అతని చూపులు కు క్క ల మీ దే వున్నాయి. కానీ అతని పెదిమలమీద కనీకనిపించని నవ్వు !

చివ్వున లేచి నిలబడింది శకుంతల. వరండా వైపు అడుగు కదపబోయింది. లో ను ం డి వస్తున్న ఇద్దరు స్త్రీలను చూసి ఆగిపోయింది. ఒకామె వృద్ధురాలు, మరొకామె పద్దెనిమిదేళ్ల యువతి. ఇద్దరూ అందంగా, ఆడంబరంగా వున్నారు. ఆ ఇంటి యజమాని స ం ప ద కు అద్దాల్లా వున్నారు.

"అన్నయ్యా, చున్నీలాల్ ఫోన్ చేశాడు. మంచి డైమండ్ నెక్లెస్‌లు వ చ్చా య ట. చూసిరానా ?" గోముగా అందా అమ్మాయి.

వాళ్ల మాటలు బాగానే వినిపిస్తున్నాయి శకుంతలకు. వినిపించేంత దూరంలోనే నిల బెట్టాడు గూర్ఖా.

"ఓకే, ఓకే" అన్నాడు సుకుమార్.

"మా మంచి అన్నయ్య" సంతోషంగా అంది.

"నీవూ డైమండ్ నెక్లెస్‌కేనా బామ్మా?" నవ్వుతూ ప్రశ్నించాడు సుకుమార్.

"లేదురా నాన్నా. లక్ష్మీదేవి విగ్రహం ఒకటి వెండితో చేయమని ఆర్డర్ ఇద్దామని" ఆ వృద్ధురాలంది. "వ ర ల క్ష్మీ వ్ర త ం వస్తోందిగా."

"మీ కారు డ్రైవర్ వచ్చాడా?" సుకుమార్.

"అదిగో" ఆ అమ్మాయి కారుషెడ్‌వైపు చూపింది.

దూరంగా విశాలమైన షెడ్‌లోవున్న ఎర్ర రంగు కారులో ఆ స్త్రీలిద్దరూ వెళ్లిపోయారు.

ఆ కారు బయటకు వెళ్తూండగానే మరో కారు బయటినుండి లోపలికి వచ్చింది. నలుగురు వ్యక్తులు దిగి సుకుమార్‌ను కలుసుకున్నారు. వాళ్లేదో వ్యాపారం గురించి మాట్లాడారు. వ్యాపారం అంతా లక్షలమీదే నడిచింది. లాభం కోట్లు మీద వుంది. అందరూ సంతోషంగా కరచాలనాలు చేసుకున్నారు. మధ్య మధ్య నౌఖర్లు తెచ్చిపెట్టిన టీ లు సిప్ చేశారు. బిస్కట్లో మునిపంటితో కొరికారు. యాపిల్ ముక్కలు నాలుకతో నాకి వదిలారు. సిగరెట్లు ఒక్క పఫ్‌తోనే యాష్‌ట్రే అనే సమాధి చేరుకుంటు న్నాయి. చివరకు వాళ్లు వెళ్లిపోయారు.

మళ్లీ కుక్కల్ని ముద్దు చేయసాగాడు సుకుమార్.

లోపలినుండి ఓ మనిషి వచ్చాడు. అతని చేతుల్లో ఫోన్ వుంది.

"కాశ్మీర్ నుండి కార్పెట్లు వచ్చాయట సార్" అంటూ అందించాడు.

సుకుమార్ ఫోన్‌లో మాట్లాడాడు.

"ఆ ఆ. నమస్తే. ఏమిటీ ? పదివేలా?"

"..........."

"అహ, ఆశ్చర్యం కాదు. బావుంటే పదివేలేమిటి ఇరవై వేలైనా ఇస్తాను."

"..........."

"అలాగే. చెక్కు పంపిస్తాము."

"..........."

"ఆ. నమస్తే, నమస్తే"

సుకుమార్ సంభాషణ ముగించాడు.

ఆ వ్యక్తి లోపలికి వెళ్లి చెక్కు బుక్కు, పెన్ తెచ్చి ఇచ్చాడు. సుకుమార్ రాసి ఇచ్చిన చెక్ తీసుకుని వెళ్లిపోయాడు.

ఎవరో వస్తున్నారు. మరెవరో వెళ్లిపోతు న్నారు. గడుస్తున్న ప్రతి క్షణం, నడుస్తున్న ప్రతి పని ఆ భవనం తాలూకు సంపన్నత్వాన్ని చెప్పకయే చెబుతున్నాయి.

ఎండ హెచ్చయింది. వడగాలికి ఆగలేని సుకుమార్ లోపలికి వెళ్లిపోయాడు. పోతూండగా అతని ముఖంలోకి చూసింది శకుంతల. అతని చూపులు శకుంతలమీద లేవు ! కానీ అతని పెదవులమీద నవ్వు వుంది. పంజాలో చిక్కి గిలగిలలాడుతున్న సాదు జంతువును చూసి పులి నవ్విన నవ్వు !

శకుంతల కాలు కదలబోయింది.


అతని వెనకే కుక్కలున్నాయి !


నిట్టూర్చింది శకుంతల మనను.


వాడి పెంచుకుంటూన్న సూర్యకిరణాలు శకుంతల గుండెలు చీల్చుకుని లోనికి చూడ సాగాయి.

* * *

"శకుంతలా"





భారత సాంస్కృతిక సమైక్యతాసంఘం (న్యూఢిల్లీ)వారు ఇటీవల ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ సంగీత కళ్యాణోత్సవానికి భారత రాష్ట్రపతి శ్రీ జెయిల్‌సింగ్ ప్రారంభోత్సవం చేసారు. సాంస్కృతిక, జాతీయ సమైక్యతలకి తమ సహకారాన్నందిస్తున్న శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణని రాష్ట్రపతి కమిటీ తరపున సత్కరిస్తున్న దృశ్యం. నిర్వాహకులు శ్రీ టి. వి. కె. శాస్త్రిని కూడ చిత్రంలో చూడవచ్చు.

''వస్తున్నా నాన్నా'' పలుకుతోనే వెలుపలికి వచ్చిన శకుంతల తండ్రిని చూసి ఆశ్చర్య పోయింది. ఆ వెంటనే ఆదుర్దా పడిపోయింది.

రఘురామయ్య భుజంమీద ఓ మనిషి అచేతనంగా వేళ్లాడుతున్నాడు!

''ఇలా పట్టు'' కూతురి సహాయంతో కుటీరంలోని నులకమంచంమీద పడుకోబెట్టాడు రఘురామయ్య.

''ఎవరు నాన్నా? ఏమైంది?'' తండ్రి అడిగిన వస్తువు అందిస్తూ అడిగింది శకుంతల.

''ఎవరో పట్నం కుర్రాడు. కోన మలుపు దగ్గర ప్రమాదం జరిగి స్పృహ పోయింది.''

రఘురామయ్య భార్య చనిపోగా విరక్తితో అడవి చేరాడు. అప్పుడు శకుంతల ఐదేళ్ల పసిపిల్ల. రఘురామయ్యకు మూలికా వైద్యం తెలుసు. విద్యాభోధన తెలుసు. ఆ రెంటితోనూ గిరిజనుల మధ్య 'రామయ్య తండ్రి'లా కాలం వెళ్లదీస్తున్నాడు.

రెండు మూడు రోజుల్లో కొంచెం తేరుకున్నాడు సుకుమార్ అనే ఆ యువకుడు.

లేడికూనలా, వెన్నెల సోనలా, పుట్టతేనెలా అందంగా, అమాయకంగా, మధుర మధురంగా కళ్లముందు తిరుగుతోంది శకుంతల. ఆమె యవ్వన మకరందం సుకుమార్ మగతనపు మధు పాన్ని పూరించి కలవర పెట్టసాగింది.

ఆ రోజు రాత్రి...

కొండ అవతల ఎవరికో త్రాచుపాము కరిచిందని రఘురామయ్యను తీసికెళ్లారు గిరిజనులు.



# శకుంతల

నిద్రపట్టని సుకుమార్, లేచి కుటీరం కిటికీదగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

కుటీరానికి దిగువన, ఓ వైపుగావున్న నీటి మడుగు గట్టున కూర్చునివుంది శకుంతల. వెన్నెలలో తప్పతడిసి, ఇంకా వెన్నెల ఆరని అపురూప కుసుమంలా వుంది శకుంతల! స్త్రీ రూపంలో చెక్కిన తెల్లమేఘంలావుంది శకుంతల! తెగిపడిన శశాంక శకలంలా వుంది శకుంతల!

పాలవెన్నెల ఆమె చెక్కిళ్ల మీదినుంచి అలల వరుసలాంటి మెడమీదుగా, వక్షస్థలం మీదికీ జలపాతంలా దుముకుతోంది. చంద్ర కిరణాలు సోకిన కలువల్లా పూర్తిగా విచ్చుకున్న కళ్లతో చంద్రునికేసి చూస్తోంది శకుంతల.

ఆ క్షణంలో నిజంగానే మనసు పారేసుకున్నాడు సుకుమార్.

దగ్గరగా వేసిన తడిక తలుపు తెరుచుకుని మెల్లగా నడిచి వచ్చాడు.

''శకుంతలా'' మృదువుగా పిలిచాడు.

ఉలికిపడిన శకుంతల అతన్ని చూసి తత్తర పాటుతో లేవబోయింది.

''లేవకు. లేవకు'' తనూ ఆమెకు కొంచెం దిగువన కూర్చున్నాడు.

నిశ్శబ్దంగా ఆమె పెదిమల మాధుర్యాన్ని రుచి చూస్తున్న చంద్రుని కిరణాన్ని చూసి అసూయ కలిగింది సుకుమార్‌కు.

తనకు కొంచెం దూరంలో చీరె కుచ్చిళ్ల లోంచి జారిన ఆమె పాదాలు ... వెన్నెల కరిగి కరిగిఅ రూపంలో ఘనీభవించినట్లుగా వున్నాయి.

శకుంతల కళ్లలోకి చూశాడు సుకుమార్. నీలి కాంతులీనుతూన్న ఆ కళ్లు, సుందర స్వప్నాలు కంటున్నట్టు మత్తెక్కి వున్నాయి.

మాటలు కలిసినా మనసెప్పుడూ బయట పెట్టలేదు సుకుమార్. ఈ అమూల్యావకాశాన్ని జారవిడువదలచుకోలేదు. జారవిడిచే అవకాశమూ లేదు.

''శకుంతలా.''

''ఊ ...''

''శకుంతల ... అంటే తెలుసా?''

''అభిజ్ఞాన శాకుంతలం చదివాను'' మెల్లగా చెప్పింది.

''అయితే శకుంతల సౌందర్యం గురించి ... నాకంటే నీకే బాగా తెలుసు.''

ఒక్క నిముషం మౌనంగా వుంది శకుంతల. తర్వాత —

''స్త్రీ సౌందర్యం గురించి స్త్రీ కంటే పురుషుడికే బాగా తెలుసు.''

ఆశ్చర్యపోయాడు సుకుమార్. శకుంతల ఇంత తెలివిగా మాట్లాడగలదని అతనూహించ లేదు. ఇంత లౌక్యం వుంటుందనీ అనుకోలేదు. అరణ్యంలో పెరిగినపిల్ల ...!

''అయితే ... అయితే శకుంతలా, స్త్రీ కంటే ఎక్కువగా స్త్రీ సౌందర్యాన్ని గుర్తించ గలిగిన పురుషుడికి ఆ సౌందర్యాన్ని ఆరాధించే అర్హత లేదంటావా? అది తప్పంటావా?''

''............''

''చెప్పు శకుంతలా.''

''కాదనుకుంటాను.''

''అయితే ... అయితే ... శకుంతలా, ఈ ప్రేమ బైరాగికి నీ ప్రేమభిక్ష ప్రసాదించు'' చప్పున శకుంతల కాలి కొనవేళ్లకు పెదిమల్ని తాకించాడు సుకుమార్.

శకుంతల హృదయం జలదరించిపోయింది. శరీరం పులకరించిపోయింది. ఆమె మనోమయ ప్రపంచం వసంతం ప్రవేశించినట్లుగా పూలు పూచిపోయింది.

సుకుమార్ పెదవులు శకుంతల పాదాల దగ్గరినుండి పైకి పైకి పాకి ఆమె అధర మధు భాండం దగ్గర ఆగిపోయాయి.

ఎంత పవిత్రంగా, సంప్రదాయ సిద్ధంగా పెరిగిన కన్యలయినా వయసు ఆకర్షణకు లోను కావటం అత్యంత సహజం. కణ్వుని ఆశ్రమంలోని శకుంతలకే ఆ కామన తప్పలేదు.

శకుంతల లొంగి పోయింది. సుకుమార్ కోరికకు కాదు. ప్రతి ఆడపిల్లలాగే తన ప్రియు నిలోచూసిన అమాయకత్వానికి, ప్రేమకు, నమ్మకానికి. ముఖ్యంగా తన పట్ల ఆరాధనకు.

పదిహేను రోజుల 'ప్రేమ వసంతం' సుకుమార్‌తోపాటే తరలిపోయింది.

గ్రీష్మం మొదలయింది!

భద్రత లేని చోట ప్రేమ భద్రంగా ఫలించటం మామూలే.

శకుంతల తల్లి అయింది;

అతనెవరో తెలీదు ... సుకుమార్ అనే పేరు తప్ప !

అతనెక్కడుంటాడో తెలీదు ... వస్తాడనే నమ్మకం తప్ప !

బిడ్డ గురించిన ఆవేదనతో రఘురామయ్య ప్రాణాలు కోల్పోయాడు. కడుపులోని బిడ్డ గురించిన ఆలోచనతో శకుంతల ప్రాణాలు నిలుపుకుంది.

అన్వేషణ మొదలయింది.

* * *

ఎండ కరకర లాడ్తోంది. చర చర పుంటోంది. పగబట్టిన తాచులా వడగాలి బుసలు కొడ్తోంది.

నీడ కోసం చూసింది శకుంతల.

ఆ చుట్టు పక్కల ఎక్కడా వృక్షాలు లేవు. అన్నీ పూల మొక్కలు, క్రోటన్లు. డబ్బు పెట్టి కొన్నవి. డబ్బును నీళ్లలాపోసి పెంచుతున్నవి. ధనం ఎంత ప్రయోజన శూన్యంగా వాడబడుతోందో తెలిసింది శకుంతలకు.

సుకుమార్ అద్భుతమైన ఆరాధనను చవి చూసిన శకుంతల పూలగుత్తిలాంటి శరీరం ఎండకు కమిలిపోసాగింది! సుకుమార్ ప్రేమదాహాన్ని తీర్చిన శకుంతల పెదవులు నీళ్లు లేక ఆరిపోయి చిట్లిపోయాయి. సుకుమార్ చుంబనలతో తడిసిపోయిన శకుంతల కాళ్లు వేడికి మాడి బొబ్బలెక్కిపోయాయి.

ఆకలితో శకుంతల పేగులు వుండచుట్టుకుపోయాయి.

* * *

సాయంకాలం నాలుగవుతూండగా గేట్లోంచి ఓ లారీ వచ్చి ఆగింది. దాన్నిండా కుర్చీలు, బల్లలు వున్నాయి. అరడజను మంది నౌఖర్లు హడావుడిగా ఆ కుర్చీలను, బల్లలను తోటలోని లాన్స్‌లో వేశారు. బల్లలమీద తెల్లటి టేబుల్ క్లాత్స్ పరచి, పూల కుండీలు వుంచారు.

# శకుంతల

ఎలెక్ట్రీషియన్స్ వచ్చి రంగురంగుల బల్బులు ఇంటి ఎలివేషన్‌కు అలంకరించారు. ఇంకా రకరకాల అందాలను అవసరం లేనంత ఆడంబరంగా అలంకరించారు.

ఆరు గంటలనుండీ ఆ ఇంటికి రకరకాల మనుషులు రంగు రంగుల కార్లలో రా నారంభించారు. అక్కడ గుమిగూడిన మనుషుల అందాల్లో, అలంకారాల్లో, ఆడంబరాల్లో తేడాలున్నా వాళ్లందర్నీ అక్కడ కలిపిన పదార్థం మాత్రం ఒక్కటే. అది డబ్బు.

చీకటిపడ్డ తర్వాత విద్యుద్దీపాల వెలుగులో అక్కడ శకుంతలకు అర్థంకాని కోలాహలం ఏదో మొదలయింది. నవ్వులు, కేరింతలు,తుళ్లింతలు, చప్పట్లు. సీసాల్లోంచి గ్లాసుల్లోకి,గ్లాసుల్లోంచి కడుపుల్లోకి అంచెలంచెలుగా మారుతున్న అందమైన రంగు రంగుల ద్రవం. పచ్చిమాంసంలా పీక్కు తింటున్న కోడికాళ్లు, చేప వెన్నుపూసలు.

శకుంతల కర్థమైంది ఒక్కటే. ఇది తనకు సంబంధించని లోకం.


శకుంతలకు పూర్తిగా అర్థమైపోయింది.

ఆమె ఆకలి అణగారిపోయింది. కాళ్లు లాగటం మానేశాయి. కళ్లు తిరగడం ఆగిపోయింది. ఒళ్లు తూలటం తగ్గిపోయింది.

శకుంతల ఆతృతగా చూడసాగింది. ఒళ్లంతా కళ్లు చేసుకుని చూడసాగింది... సుకుమార్ కోసం, అతని రాకకోసం.

చాలా సేపటికి, అతిథి దేవుళ్లందరూ అదృశ్యమైపోయిన చాలాసేపటికి సుకుమార్ శకుంతల దగ్గరకు వచ్చాడు.

శకుంతల అతన్ని చూసి సిగ్గుపడలేదు. పరవశంతో సోలిపోలేదు. కనురెప్పలు లజ్జతో బరువుగా వాలిపోలేదు. ముఖం అవనతం కాలేదు. నింపాదిగా, సూటిగా చూసింది.




ఠీవిగా నిలబడి సిగరెట్ వెలిగించుకున్నాడు సుకుమార్. శకుంతల కేసి ఓరగా చూస్తూ "ఇంకా ఈ ఇంటి ఇల్లాలుగా రావడానికి ధైర్యం మిగిలివుందా ?" అన్నాడు.

"లేదు"

నవ్వాడు సుకుమార్, విజయ గర్వంతో నవ్వుతూనే వున్నాడు. శకుంతల పెదిమలమీదా నవ్వు... వాడిగా.

"చూడూ, శకుంతల... శకుంతల కథ చాలా పాతది. అది అలా పునరావృతం అవుతూనే వుంది. నేనూ శకుంతలనే. ప్రేమానురక్తనే. పరిత్యక్తనే. అందులో విచిత్రం ఏమీలేదు. కానీ ధనం ఎర చూపి వల వేసే ఈ సమాజంలో, ధన ప్రదర్శనతో భయపెట్టి వదిలించుకోవాలనే నేర్పు వుంది చూడూ, అది చాలా కొత్తది. అరణ్యంలోని క్రూర జంతువులా, ప్రేమించిన ఆడదాన్ని ఇంత క్రూరంగా దెబ్బతీసిన దుష్యంతుడున్నాడు చూడూ, వాడు చరిత్రకు చాలా చాలా కొత్తవాడు. ఎంత నీచంగా, ఎంత క్రూరంగా చెలగాటమాడావు ! సరే. ఇంతసేపటిగా, ఇంత సహనంగా నేనిక్కడ నిలబడ్డానే, నీవు కరుణిస్తావేమోననే ఆశతో కాదు. నీ పాదాల దగ్గర ఇంత చోటుకోసమూ కాదు. నీ వడిగావే 'ఇంకా ఈ ఇంటి ఇల్లాలుగా రావడానికి ధైర్యం మిగిలి వుందా ?' అని. దానికి 'లే'దని సమాధానం చెప్పడానికి. నీ వంటి క్రూరమృగం మసలే ఈ భయంకరారణ్యంలోకి అడుగుపెట్టే ధైర్యం నాకు లేదని చెప్పడానికి నీ సహజ జంతు తత్వాన్ని చూపి నాకు చాలా మేలు చేశావని కృతజ్ఞత తెల్పుకోవడానికి. అయినా నిన్ను జంతువుల్తో పోల్చడం ఏమిటి !!! క్రూరజంతువులు ప్రియురాళ్ని ఎప్పుడూ మోసగించవు, వాటి కోసం ప్రాణాల్ని ఇస్తాయితప్ప. ఎందుకో తెలుసా? వాటికి 'బుద్ధి' వుండదు గనుక. వస్తాను."

సుకుమార్ నవ్వు ఎప్పుడో ఆగిపోయింది. ఏలుకొమ్మని కాళ్లా వేళ్లా పడ్తే మాటల్తో మరింత చిత్రహింస పెట్టి ఆమె బాధను ఎంజాయ్ చేసి పంపాలనుకున్నాడు సుకుమార్. కానీ శకుంతల తిరస్కారంతో అతని అహం దెబ్బ తిన్నట్లయింది. మగతనపు పౌరుషంతో రగిలిపోయాడు. వెళ్లడానికి అడుగు కదిపిన శకుంతలను "ఆగు"అంటూ చేయి పట్టుకున్నాడు.

బుసకొట్టే నాగులా విసురుగా కదిలింది శకుంతల. సుకుమార్ చెంప చెళ్లుమంది.

"నిన్ను క్రూర జంతు వన్నాను. క్రూర జంతువంటే నా కెప్పుడూ భయం లేదు. కాని అభిమానం దెబ్బతిన్న ఆడది పగపట్టిన పాము వంటిది. దాని జోలికి వెళ్లావా ప్రాణంతీస్తుంది జాగ్రత్త."

బుద్ధిలేని జంతువుల మధ్యకే మళ్లీ పయనమై వెళ్లిపోయింది శకుంతల. ★